ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు
తేదీ: 31-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో శ్రేయస్సును తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

- ఇండో-పసిఫిక్ ప్రాంత శ్రేయస్సు కోసం క్వాడ్ కూటమి కీలకమైన శక్తిగా నిలుస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

- కేరళలోని వాయనాడ్ లో ఈ సంవత్సరం జులైలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాన్ని తీవ్ర మైన జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

- చెన్నైలోని ఒక విశ్వ విద్యాలయంలో జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని జాతీయ మహిళా కమిషన్ (NCW) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన సంవత్సరం అందరికీ శ్రేయస్సును, శాంతి, ఆరోగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ... దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భారత్ ఆసియాలో మూడవ అతిపెద్ద దేశంగా ఆవిర్భవించిందని, 24.82 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏక్ పేడ్ మా కే నామ్ సందేశం 102 కోట్ల మొక్కలు నాటడానికి దారితీసిందని చెప్పారు. 4 కోట్ల 1 లక్ష మంది యువతకు 2 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాల కల్పన, పారా ఒలింపిక్స్‌లో భారత్ 29 పతకాలను సాధించడం లాంటి అంశాలను ప్రస్తావించారు. పెరిగిన వైద్య కళాశాలలు, మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, అటల్ పెన్షన్, అబుదాబిలో ఆలయ నిర్మాణం, మూడు నూతన నేర చట్టాలు మొదలైన అంశాలను ప్రధానమంత్రి తన సందేశంలో వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికా సభ్య దేశాలుగా ఉన్న కూటమి క్వాడ్ ఇండో-పసిఫిక్ ప్రాంత శ్రేయస్సు కోసం కీలకమైన శక్తిగా నిలుస్తుందని భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఈ ప్రాంత అవసరాలు తీర్చేందుకు క్వాడ్... నిబద్ధతతో పని చేస్తుందని సభ్య దేశాల విదేశాంగ మంత్రులతో కలిసి ఆయన ఒక సామాజిక మాధ్యమం ప్రకటనలో ఉద్ఘాటించారు. క్వాడ్ కూటమి 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆయా దేశాల విదేశాంగ మంత్రులు ఈ సంయుక్త ప్రకటన చేస్తూ... క్వాడ్ ప్రస్తుతం ఇండో-పసిఫిక్ ప్రాంత భాగస్వామ్యంతో పని చేస్తోందని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, కేన్సర్ వంటి వ్యాధులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉగ్రవాద నిర్మూలన వంటి అంశాల్లో సవాళ్ళను ఎదుర్కొనేందుకు అవసరమైన సహకారాన్ని క్వాడ్ అందిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒక దేశం ఒక ఎన్నికలు ద్వారా సమాఖ్య నిర్మాణానికి ఎటువంటి హానీ కలగదని కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయబడిందని, ప్రతిపక్షాలు కూడా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగాలని కోరుతున్నారని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, ఉమ్మడి పౌర స్మృతి అంశంపై మాట్లాడుతూ, ఇది భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టోలో భాగమని, ఇప్పటికే గోవా, ఉత్తరాఖండ్‌లలో ఇది అమలు చేయబడుతోందని ఆయన వెల్లడిస్తూ..
(వాయిస్ బైట్..35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళలో జులై నెలలో సంభవించిన కొండచరియలు విరిగిపడిన ఘటనను తీవ్ర మైన జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మంత్రుల బృందం అంచనాలను అనుసరించి జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అదనపు సహాయం

అందించనున్నట్టు కేంద్ర హోంశాఖ కేరళ ప్రభుత్వానికి తెలిపింది. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి కొండచరియల విపత్తు తీవ్రత దృష్ట్యా అక్కడివారి ప్రయోజనాల కోసం మంత్రుల బృందం దీనిని తీవ్రమైన ప్రకృతి విపత్తుగా పరిగణించిందని తెలియజేసింది. వాయనాడ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడిన ఘటనల 200 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. ఇంకా కొన్ని వేలమంది నిరాశ్రయులయ్యారు. కాగా, వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చెన్నైలోని ఒక విశ్వ విద్యాలయంలో జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని జాతీయ మహిళా కమిషన్ (NCW) వెల్లడించింది. కేసును స్వీకరించిన అనంతరం నిజనిర్ధారణ కమిటీని దర్యాప్తు కోసం చెన్నైకి పంపామని కమిషన్ పేర్కొంది. కమిటీ సభ్యులు బాధితురాలిని, ఆమె బంధువులను కలిసి ఘటన వివరాలను తెలుసుకొని, ఆమెకు అవసరమైన సహాయం అందించామని తెలిపింది. అలాగే, తమిళనాడు గవర్నర్ ను కలిసి కేసు పురోగతిని సమీక్షించామని, బాధితులకు న్యాయం జరిగేలా విద్యా సంస్థలలో భద్రతా చర్యలను పటిష్టం చేసేందుకు కట్టుబడి ఉన్నామని జాతీయ మహిళా కమిషన్ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష రంగానికి 2024 ఒక ముఖ్యమైన సంవత్సరమని అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, 2024 సంవత్సరంలో మొదటి రోజు XPoSat తో ప్రారంభమైందని, ఆ తరువాత ఆదిత్య L1 మిషన్ ప్రయోగం జరిగిందని అన్నారు. భారత్ తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆగస్టులో జరుపుకుందని, నిన్న ఇస్రో SpeDeX మిషన్ విజయవంతంగా పూర్తయిందని చెప్పారు. గగన్‌యాన్ కోసం ఈ మధ్య కాలంలో చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. డాకింగ్ టెక్నాలజీకి సంబంధించి భారత్ చేపట్టిన ప్రయోగాలలో స్పాడెక్స్ మిషన్ ఒకటని తెలిపారు. ఇది పూర్తిగా స్వదేశీ సాంకేతికత అని, అందుకే దీనికి భారతీయ డాకింగ్ టెక్నాలజీ అని పేరు పెట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్..30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రకు చెందిన అనన్యా నాయుడు 67వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించింది. భోపాల్ స్టేట్ అకాడమీ షూటింగ్ రేంజ్ లో ఈరోజు జరిగిన పోటీల్లో రైల్వేస్‌కు చెందిన మేఘనా సజ్జనార్ పై ఆమె 0-2 పాయింట్ల తేడాతో గెలిచి, తొలి జాతీయ టైటిల్‌ను సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పశ్చిమ బెంగాల్ లోని కోల్‌కతాలో 6.60 కోట్ల రూపాయల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకుంది. డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టరేట్ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) సంస్థలు సంయుక్తంగా దాడులు నిర్వహించి నకిలీ డ్రగ్స్ ను స్వాధీనం చేసుకుని, ఒక నిందితుడిని అరెస్టు చేశాయి. ఈ మందులన్నీ యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్ వంటి ఖరీదైన చికిత్సలకు చెందినవని, బంగ్లాదేశ్, ఐర్లాండ్, టర్కీ, యుఎస్ఎ దేశాల్లో తయారు చేయబడినట్టు లేబుల్స్ ఉన్నాయని శాఖ పేర్కొంది. వీటికి అవసరమైన ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నకిలీవిగా పరిగణించి, నమూనాలను నాణ్యత పరీక్షలకు పంపించినట్టు శాఖ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యెమెన్‌లో మరణశిక్ష విధించబడిన భారతీయ నర్సు నిమిషా ప్రియకు అన్ని విధాలా సహాయాన్ని అందిస్తున్నామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కేసుకు సంబంధించి పత్రికా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ, యెమెన్ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి తెలుసని అన్నారు. కేరళకు చెందిన ప్రియ, యెమెన్‌లో హత్యకు పాల్పడినట్టు మీడియా సమాచారం ఉందని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పొగమంచు కారణంగా దాదాపు 30 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వేశాఖ తెలిపింది. కర్ణాటక ఎక్స్‌ప్రెస్, సంపర్క్ క్రాంతి, తేజస్ రాజధాని, లక్నో మెయిల్, ఉంచాహర్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్ళు నిర్ణీత సమయం కంటే 30 నిమిషాల నుండి 4 గంటల వరకు అలస్యంగా నడుస్తున్నట్టు రైల్వే శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్‌లో పొలాల నుండి వెలువడే వ్యర్థ పదార్థాల నుండి వివిధ ఉత్పత్తులను తయారుచేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందించిన వేస్ట్ టు గోల్డ్ సూత్రం స్ఫూర్తితో ఇక్కడి వారు అరటినారతో ఉత్పత్తులు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులలో, అరటి పంట వ్యర్థాల నుండి తయారైన బుర్హాన్‌పూర్ క్యాప్ అత్యంత ప్రముఖమైనది. దీనికి భారత్ తో పాటు విదేశాలలో కూడా డిమాండ్ పెరిగింది. చాలా ఆకర్షణీయంగా కనిపించే ఈ టోపీల ధర 1100 నుండి 1200 రూపాయల వరకు ఉంటుంది. అరటి నారతో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయానికి జిల్లా యంత్రాంగం ఒక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తోందని బుర్హాన్‌పూర్ జిల్లా కలెక్టర్ భవ్య మిట్టల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన హక్కులను పౌరులు పొందేందుకు భారత హోంమంత్రిత్వ శాఖ చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలనిచ్చాయి. ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర చట్టాలు శిక్షలకు కాకుండా న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ రూపొందించబడ్డాయి. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం నూతన చట్టాలు బాధితుల పరంగా పనిచేస్తూ ఆలస్యాన్ని నివారిస్తాయి. అలాగే, హోంమంత్రిత్వ శాఖ భద్రత, మహిళల హక్కులు, అట్టడుగు వర్గాలను కలుపుకోవడం, వంటి కార్యక్రమాల శ్రేణిని ప్రారంభించింది. ఈ సంవత్సరం మార్చి నెలలో అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల్లో మైనారిటీలుగా ఉంటూ హింసకు గురౌతున్న హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందినవారికి భారత పౌరసత్వాన్ని అందిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =